సాక్షి
అనకాపల్లి
శనివారం ၊ 27 ၊ ఏప్రిల్ ၊ 2024



ఐపీఆర్‌లో పీజీ డిప్లమా కోర్సు

విశాఖ: ఏయూలో మేథో హక్కులపై పీజీ డిప్లమా కోర్సును ప్రారంభించారు. వీసీ ఆచార్య ప్రసాదరెడ్డి బ్రోచర్‌ను ఆవిష్కరించారు.



ఏప్రిల్‌లోనే మే ఫ్లవర్

సాక్షి,పాడేరు: ఏజెన్సీలో మే నెల రాకముందే మే ఫ్లవర్‌లు కనువిందు చేస్తున్నాయి. కొత్తవల్లి వెళ్లే రోడ్డులో ఆకట్టుకుంటున్నాయి.

గరిష్టం/కనిష్టం
38.3/25.5

వాతావరణం

తేలికపాటి జల్లులు కురుస్తాయని, గంటకు 40–50 కి.మీ. వేగంతో గాలులు వీయవచ్చునని ఆర్‌ఏఆర్‌ఎస్ వాతావరణ విభాగం శాస్త్రవేత్త వి.గౌరి తెలిపారు.

న్యూస్‌రీల్

స్ట్రాంగ్ రూమ్‌ల భద్రతపై దృష్టి సారించాలి

- జిల్లా పోలీస్ భద్రత పరిశీలకుడు మోహన్ దహికర్



యలమంచిలిలో ఈవీఎంల స్ట్రాంగ్ రూమ్‌లను పరిశీలిస్తున్న జిల్లా పోలీస్ ఎన్నికల భద్రత అబ్జర్వర్ మోహన్ దహికర్

యలమంచిలి: ఈవీంలను భద్రపరిచిన స్ట్రాంగ్ రూమ్‌లపై ప్రత్యేకంగా అధికారుల పర్యవేక్షణ ఉండాలని జిల్లా ఎన్నికల పోలీస్ భద్రత పరిశీలకుడు మోహన్ దహికర్ అన్నారు. గురజాడ అప్పారావు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఈవీఎంలను భద్రపరిచిన స్ట్రాంగ్ రూమ్‌లను ఆయన యలమంచిలి తహసీల్దార్ అప్పలరాజు, సర్కిల్ ఇన్‌స్పెక్టర్ షేక్ గఫూర్, రూరల్ ఎస్ఐ సింహాచలం, ట్రాఫిక్ ఎస్ఐ రామకృష్ణతో కలసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈవీఎంలను భద్రపరిచిన స్ట్రాంగ్ రూమ్‌పై అధికారులు అప్రమత్తంగా వ్యవహరించాలని, ఎప్పటికప్పుడు ప్రత్యేకంగా నిఘా పెట్టి జాగ్రత్తలు తీసుకోవాలని ఎన్నికల సిబ్బందికి సూచనలు చేశారు. అనంతరం కళాశాల పరిసరాలను ఆయన సిబ్బందితో కలిసి పరిశీలించారు.

నేడు రాజకీయ ప్రతినిధులతో సమావేశం

తుమ్మపాల: గుర్తింపు పొందిన జాతీయ, రాష్ట్ర రాజకీయ పార్టీల ప్రతినిధులతో కలెక్టరేట్‌లో శుక్రవారం ఉదయం 11 గంటలకు జిల్లా ఎన్నికల పరిశీలకుల సమావేశాన్ని నిర్వహించనున్నట్లు జిల్లా డిప్యూటీ ఎన్నికల అధికారి, డీఆర్వో బి.దయానిధి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో ఎన్నికల ఏర్పాట్లు, నిబంధనల అమలు, వంటి అంశాలపై చోడవరం, మాడుగుల, నర్సీపట్నం నియోజకవర్గాల ఎన్నికల పరిశీలకుడు దల్జిత్‌సింగ్ మంగత్, అనకాపల్లి, పెందుర్తి, యలమంచిలి, పాయకరావుపేట నియోజకవర్గాల పరిశీలకుడు డాక్టర్ రాకేష్‌కుమార్ మాట్లాడతారన్నారు.

బెల్లం మార్కెట్ కళకళ



మార్కెట్‌కు చేరిన బెల్లం దిమ్మలు

అనకాపల్లి: బెల్లం మార్కెట్‌లో శుక్రవారం లావాదేవీలు ప్రారంభమయ్యాయి. ఈ నెల 18 నుంచి మార్కెట్‌లో కార్యకలాపాలు నిలిచిపోయిన విషయం తెలిసిందే. కొలగార్లు, వర్తకులకు మధ్య జరిగిన చర్చలు ఫలించడంతో యథావిధిగా లావాదేవీలు ప్రారంభమయ్యాయి. సుమారు 6,034 బెల్లం దిమ్మలను వివిధ ప్రాంతాల నుంచి రైతులు మార్కెట్‌కు తీసుకువచ్చారని మార్కెట్ కమిటీ కార్యదర్శి శకుంతల చెప్పారు.

ఉపాధి కూలీలపై కందిరీగల దాడి

- 25 మందికి గాయాలు



గాయపడిన కూలీలను పరామర్శిస్తున్న ఎంఎస్ఎంఈ చైర్మన్ సూర్యనారాయణరాజు

కోటవురట్ల: కందిరీగలు దాడి చేయడంతో 25 మంది ఉపాధి కూలీలు తీవ్రంగా గాయపడ్డారు. అధికారులు వారిని హుటాహుటిన స్థానిక కమ్యూనిటీ ఆస్పత్రికి తరలించి చికిత్స చేయించారు. కైలాసపట్నం రెవెన్యూ పరిధి కరక చెరువులో 187 మంది కూలీలు శుక్రవారం ఉపాధి పనులు చేస్తున్నారు. ఇంతలో ఓ పొదపై కందిరీగల తుట్టె రేగడంతో కూలీలను చుట్టిముట్టాయి. దాంతో వారంతా హాహాకారాలు చేస్తూ పరుగులు తీశారు. ఈ దాడిలో 25 మంది గాయపడ్డారు. వెంటనే వారిని సహచర కూలీలు, అధికారులు ఆస్పత్రికి తరలించారు. విషయం తెలుసుకున్న ఎంఎస్ఎంఈ చైర్మన్ డి.వి.సూర్యనారాయణరాజు ఆస్పత్రికి వెళ్లి పరామర్శించారు. డాక్టర్‌తో మాట్లాడి మెరుగైన చికిత్స అందించాలని కోరారు. ప్రస్తుతం వారికి ఎటువంటి అపాయం లేదని వైద్యులు తెలిపారు. ఎంపీడీవో కాశీవిశ్వనాథరావు, ఏపీవో గంగునాయుడు, మాజీ సర్పంచ్ సిద్ధాబత్తుల నాగేశ్వరరావు వారిని పరామర్శించారు.

టీడీపీలో ‘పైలా’ కలకలం

- తనకు టికెట్ అడ్డుకున్న సి.ఎం.రమేష్ ఓటమే ధ్యేయంగా అడుగులు
- మాడుగుల అసెంబ్లీ, అనకాపల్లి ఎంపీ స్థానాల్లో పోటీకి సిద్ధం
- అందుకే రెండు చోట్ల నామినేషన్ల దాఖలు
- పార్టీ కోసం రూ.10 కోట్లకు పైగా ఖర్చు చేసినట్లు సన్నిహితుల వద్ద ఆవేదన



సాక్షి, అనకాపల్లి: టీడీపీకి పైలా ప్రసాదరావు కొరకరాని కొయ్యగా తయారయ్యారు. అనకాపల్లి పార్లమెంట్, మాడుగుల అసెంబ్లీ స్థానాలకు నామినేషన్ వేసి పార్టీ అధిష్టానానికి కలవరం కలిగిస్తున్నారు. తనకు ఎమ్మెల్యే టికెట్ రాకుండా అడ్డుకున్న అనకాపల్లి బీజేపీ ఎంపీ అభ్యర్థి సి.ఎం.రమేష్ ఓటమే ధ్యేయంగా అడుగులు వేస్తున్నారు. అందుకే తాను రెండుచోట్ల పోటీ చేస్తున్నట్లు ఆయన చెబుతున్నారు. పార్టీ కోసం రూ.10 కోట్లకు పైగా ఖర్చు చేశానని, తనకు జరిగిన అన్యాయానికి అంతకంతా కక్ష తీర్చుకుంటానని ఆయన సన్నిహితుల వద్ద స్పష్టం చేసినట్టు తెలుస్తోంది. తనకు టికెట్ ఇవ్వడం.. దాన్ని మళ్లీ వెనక్కి తీసుకోవడం వెనక సీఎం రమేష్ ఉన్నాడని.. టీడీపీలో బీజేపీ నేత జోక్యం చేసుకోవడమేంటని.. ఆ పార్టీలో కీలక నేత ఒకరి దగ్గర తన గోడు వినిపించుకున్నారట. తనకు జరిగిన అన్యాయాన్ని ప్రతి నియోజకవర్గంలో టీడీపీ కేడర్‌కు వివరిస్తానని, సీఎం రమేష్ వైఖరిని ఎండగడతానని, ఆయనను ఓడించి తీరుతానని పైలా శపథం చేస్తున్నారు.

వ్యూహం ప్రకారమే...

బండారు సత్యనారాయణమూర్తిని మాడుగుల నుంచి బరిలోకి దింపాలన్న ఆలోచన ఈనాటిది కాదని, చంద్రబాబు వ్యూహం ప్రకారమే అందుకు పావులు కదిపారని తెలుస్తోంది. అయితే ఈ విషయం ముందు చెప్పకుండా తనకు టికెట్ ఇస్తానని ఆశపెట్టి కోట్లు ఖర్చు చేయించారని, ఆఖరికి తన పేరు అభ్యర్థిగా ప్రకటించి కూడా వెనక్కి తీసుకున్నారని పైలా ప్రసాదరావు ఆవేదన చెందుతున్నారు. టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థిగా పైలా ప్రసాదరావును ప్రకటించడానికి నెల రోజుల ముందు.. కె.కోటపాడులో చంద్రబాబు బహిరంగ సభ జరిగింది. ఆ సభలో చంద్రబాబు మాట్లాడుతూ ఎవరికి సీటు ఇచ్చినా గెలిపించాలని చెప్పారు. బండారును వేదికపైకి పిలిచి ప్రాధాన్యం ఇచ్చారు. చంద్రబాబు వ్యూహం తెలియక పైలాతో పాటు గవిరెడ్డి రామానాయుడు, పీవీజీ కుమార్ మాడుగుల టికెట్ ఆశించారు. బండారుకు పెందుర్తి సీటు ఇవ్వడం ఇష్టం లేని చంద్రబాబు మాడుగులలో అతనిని రంగంలోకి దింపి స్థానిక నేతలు ముగ్గురికీ ఝలక్ ఇచ్చారు. సీఎం రమేష్ జోక్యంతో గవిరెడ్డి, పీవీజీ మెత్తబడినా పైలా ప్రసాదరావు గట్టిగా నిలబడ్డారు. చంద్రబాబు వెన్నుపోటు రాజకీయాలు మరోసారి పార్టీ క్యాడర్‌ను సైతం విస్మయపరిచాయి.

ఎమ్మెల్యే టికెట్ ఇస్తామని కోట్లు ఖర్చు పెట్టించారు..

మాడుగుల టీడీపీ ఎమ్మెల్యే టికెట్ కేటాయిస్తామని నారా లోకేష్ హామీ ఇవ్వడంతో పైలా ప్రసాదరావు రూ.10 కోట్లకు పైగా ఖర్చు చేసినట్లు సమాచారం. రాజమహేంద్రవరంలో నిర్వహించిన మహానాడు కార్యక్రమంలో కోటి రూపాయలు పార్టీకి విరాళంగా ప్రకటించారు. అంతేకాకుండా అక్కడకు కార్యకర్తలను, నాయకులను తరలించడానికి కూడా భారీగానే ఖర్చు చేశారు. చినబాబు యువగళంలో సుమారు రూ.2 కోట్ల నుంచి రూ.3 కోట్ల వరకు ఖర్చు చేయించారు. అంతేకాకుండా కె.కోటపాడు సభ ఖర్చులు సైతం ప్రసాదరావు నెత్తిపైనే రుద్దారని, చివరకు అన్యాయం చేశారని టీడీపీలో విస్తృత చర్చ నడుస్తోంది.

22 నామినేషన్లకు ఆమోదం

- అనకాపల్లి ఎంపీ స్థానానికి మొత్తం 25 నామినేషన్లు
- మూడు తిరస్కరణ



సాక్షి, అనకాపల్లి: అనకాపల్లి పార్లమెంట్ స్థానానికి 22 నామినేషన్లు ఆమోదించగా, మూడు తిరస్కరణకు గురయ్యాయి. ఇక్కడ పోటీకి 25 మంది అభ్యర్థులు 29 సెట్ల నామినేషన్లు వేయగా, జిల్లా ఎన్నికల అధికారి రవి పట్టన్‌శెట్టి ఆధ్వర్యంలో శుక్రవారం వీటికి స్క్రూటినీ నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ నుంచి బూడి ముత్యాలనాయుడు నామినేషన్‌ను అంగీకరించి అదే పార్టీ నుంచి ప్రత్యామ్నాయ అభ్యర్థిగా వేసిన భీశెట్టి వెంకట సత్యవతి నామినేషన్ తిరస్కరించారు. బీజేపీ నుంచి చింతకుంట మునయ్య రమేష్ నామినేషన్‌ను అంగీకరించి, అదే పార్టీ నుంచి ప్రత్యామ్నాయ అభ్యర్థిగా వేసిన చింతకుంట రమేష్ శ్రీదేవి నామినేషన్ తిరస్కరించారు. నవరంగ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా గొల్లివిల్లి రమేష్ నాయుడు నామినేషన్ తిరస్కరణకు గురైంది. ఇతనిది గుర్తింపు పొందిన పార్టీ కానందున కనీసం పది మంది ప్రతిపాదించాలి. ఒక్కరే ప్రతిపాదించడంతో తిరస్కరించారు. వెరసి అనకాపల్లి పార్లమెంట్ స్థానానికి బూడి ముత్యాలనాయుడు (వైఎస్సార్‌సీపీ), చింతకుంట మునయ్య రమేష్ (బీజేపీ), పలకా శ్రీరామ్మూర్తి (బీఎస్పీ), వేగి వెంకటేష్ (కాంగ్రెస్), కోన గురవయ్య (ఎస్పీ) తదితరులు బరిలో నిలిచారు. టీడీపీ రెబల్‌గా పైలా ప్రసాదరావు రంగంలో ఉన్నారు.

చెల్లని జనసేన కుయుక్తులు

అనకాపల్లి: వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి మలసాల భరత్‌కుమార్ పేరును తలపించేలా పిల్లా వారి వీధికి చెందిన కామిరెడ్డి భరత్‌కుమార్ అనే వ్యక్తిని ఇండిపెండెంట్ ఎమ్మెల్యే అభ్యర్థిగా బరిలోకి దించేందుకు జనసేన నేతలు కుయుక్తులు పన్నారు. అయితే అతని వయస్సు రెండేళ్ల తక్కువగా (23) ఉండడంతో ఎన్నికల రిటర్నింగ్ అధికారి కామిరెడ్డి భరత్‌కుమార్ నామినేషన్ తిరస్కరించారు. జనసేన నేతలు ఎన్ని కుయుక్తులు పన్నినా అనకాపల్లి ఎమ్మెల్యే అభ్యర్థిగా మలసాల భరత్‌కుమార్ గెలుపు ఖాయమని వైఎస్సార్‌సీపీ శ్రేణులు పేర్కొన్నాయి.

అసెంబ్లీ స్థానాల్లో పరిశీలన పూర్తయ్యాక..

నియోజకవర్గం	మొత్తం నామినేషన్లు	తిరస్కరణ	మిగిలినవి
అనకాపల్లి	15	1	14
పాయకరావుపేట	11	1	10
చోడవరం	8	2	6
మాడుగుల	14	3	11
యలమంచిలి	18	4	14
నర్సీపట్నం	10	2	8

పార్టీలు మారిన వారికే పదవులా?

- 40 ఏళ్లుగా ఊడిగం చేస్తున్న మమ్మల్ని విస్మరిస్తారా..
- సొంత సామాజికవర్గం వారికే పదవులన్నీ కట్టబెడతారా.!
- పెందుర్తి టీడీపీ ఇన్‌చార్జిగా బాబ్జిని నియమించడంపై కార్పొరేటర్ పీలా ఫైర్
- బీజేపీ ఎంపీ అభ్యర్థి సీఎం రమేష్ సమక్షంలో నిలదీసిన శ్రీనివాస్

పెందుర్తి: పెందుర్తి టీడీపీలో మంటలు చల్లారడం లేదు. పదవుల పందేరంలో నాకు అన్యాయం జరిగిందంటే.. నాకు జరిగిందని ఆ పార్టీ సీనియర్ నాయకులు అక్కసు వెళ్లగక్కుతూనే ఉన్నారు. మొన్నటి వరకు తనకు పెందుర్తి టికెట్ ఇవ్వలేదని అలకబూని అధినేత చంద్రబాబును నానా మాటలు అన్న బండారు సత్యనారాయణమూర్తికి మాడుగుల టికెట్ కేటాయించడంతో చిరకాల రాజకీయ శత్రువు అయిన పంచకర్ల రమేష్‌బాబుకు దాసోహం అయిపోయారు.

గండి వర్సెస్ పీలా

అయితే తాజాగా గండి బాబ్జీ, పీలా శ్రీనివాసరావుల మధ్య వివాదం రాజుకుంది. పెందుర్తి టీడీపీ ఇన్‌చార్జిగా గండి బాబ్జీని అధినేత చంద్రబాబు ప్రకటించడంతో దీర్ఘకాలంగా పార్టీకి నమ్మినబంటుగా ఉన్న కార్పొరేటర్ పీలా శ్రీనివాసరావు అగ్గిమీద గుగ్గిలమవుతున్నారు. చంద్రబాబు దూత, బీజేపీ అనకాపల్లి ఎంపీ అభ్యర్థి సీఎం రమేష్ ఎదుటే గండి బాబ్జీ నియామకాన్ని పీలా శ్రీనివాసరావు వ్యతిరేకించారు. గురువారం రాత్రి అనకాపల్లిలోని సీఎం రమేష్ క్యాంప్ కార్యాలయంలోనే పీలా శ్రీనివాసరావు బహిరంగానే తన అక్కసు వెల్లగక్కారు. ఎన్నో దశాబ్దాలుగా పార్టీని నమ్ముకుని ఉన్న తమకు కాదని పార్టీలు మారి వచ్చిన గండి బాబ్జీని పెందుర్తి ఇన్‌చార్జిగా ఎలా నియమిస్తారని నిలదీశారు. సామాజికవర్గ సానుభూతితోనే గండి బాబ్జీని సిఫార్సు చేశారని సీఎం రమేష్ తీరుపై పీలా పరోక్షంగా విమర్శలకు దిగారు. అనకాపల్లిలో తన సోదరుడు పీలా గోవింద సత్యనారాయణకు, పెందుర్తిలో తనకు ఎంతో పరాభావం జరిగిందని ఆక్రోశం వెల్లగక్కారు. అయితే పీలా శ్రీనివాస్ మరింతగా ఊగిపోతున్న సమయంలో సీఎం రమేష్‌తో పాటు టీడీపీ సీనియర్ నాయకులు కలగజేసుకుని సముదాయించారు. దీంతో పీలా శ్రీనివాస్ నెమ్మదించి సమావేశం నుంచి వెనుదిరిగినట్లు విశ్వసనీయ సమాచారం.

ఎన్నికల తనిఖీల్లో రూ.3.25 కోట్ల సొత్తు సీజ్

- విస్తృతంగా ఫ్లయింగ్ స్క్వాడ్ తనిఖీలు
- ఎఫ్ఎస్టీ నోడల్ అధికారి స్మరణ్‌రాజ్

తుమ్మపాల: జిల్లాలో ఎన్నికల నిబంధనలు అతిక్రమించి తరలిస్తున్న రూ.3.25 కోట్ల విలువైన నగదు, మద్యం, వస్తువులు, గంజాయి సీజ్ చేసినట్లు ఎఫ్ఎస్టీ నోడల్ అధికారి, అసిస్టెంట్ కలెక్టర్ బి.స్మరణ్‌రాజ్ తెలిపారు. జిల్లాలో ఎన్నికల ప్రచారాన్ని అన్ని పార్టీల అభ్యర్థులు వేగవంతం చేశారని, సభలు, సమావేశాలు, ర్యాలీలతోపాటు ఇంటింటి ప్రచారం చేస్తున్నారని, అదేస్థాయిలో జిల్లా యంత్రాంగం అప్రమత్తమై ఎన్నికల నియమావళి అతిక్రమణలపై ఫ్లయింగ్ స్క్వాడ్‌ల ద్వారా తనిఖీలు చేస్తున్నామన్నారు. గత నెల 16 నుంచి చేపడుతున్న ఎన్నికల తనిఖీల్లో రూ.22.5 లక్షల నగదు, రూ.2.16 కోట్ల విలువైన మద్యం, రూ.59 లక్షల విలువ చేసే గంజాయి, రూ.2.6 లక్షల విలువ చేసే కానుకలు రూ.22.9 లక్షల విలువైన సారా పట్టుకున్నామన్నారు. అనుమానాస్పద ప్రాంతాల్లో ఫ్లయింగ్ స్క్వాడ్‌ల ద్వారా తనిఖీలు ముమ్మరం చేస్తున్నామన్నారు. అక్రమ నగదు, మద్యం, కానుకల పంపకాల ప్రలోభాలను పసిగట్టి కఠిన చర్యలు తీసుకుంటున్నామన్నారు. జిల్లాలో 54 ఎఫ్ఎస్టీ టీమ్‌లు, 54 స్టాటిక్ సర్వెలెన్స్ టీమ్‌లు నిత్యం సోదాలు నిర్వహిస్తున్నాయని, గత రెండు రోజుల్లో పాయకరావుపేట, మాడుగుల, యలమంచిలి నియోజకవర్గాల్లో చేసిన తనిఖీల్లో 165 అక్రమ మద్యం సీసాలు పట్టుకున్నామన్నారు.

నేడు పాలిసెట్ పరీక్ష

తుమ్మపాల: పాలిసెట్–2024 కామన్ ఎంట్రన్స్ పరీక్ష జిల్లాలోని 27 కేంద్రాల్లో శుక్రవారం నిర్వహించనున్నట్లు జిల్లా కోఆర్డినేటర్ ఐ.వి.ఎస్.ఎస్.శ్రీనివాసరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 9,643 మంది విద్యార్థులు హాజరు కానున్నట్లు పేర్కొన్నారు. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు జరిగే పరీక్షకు ఉదయం 9 గంటలకు హాజరు కావాలన్నారు. హాల్ టికెట్, పెన్సిల్, ఎరైజర్, బాల్‌పాయింట్ పెన్, తప్పనిసరిగా తీసుకురావాలన్నారు. మొబైల్ ఫోన్లు, ఎటువంటి ఎలక్ట్రానిక్ పరికరాలు అనుమతించబోమన్నారు. సమాచారం కోసం 8186852527కు సంప్రదించాలన్నారు.

29న చోడవరంలో సీఎం సభ



బుచ్చెయ్యపేట మండల నాయకులతో మాట్లాడుతున్న విప్ ధర్మశ్రీ



పాయకరావుపేటలో సభా స్థలిని పరిశీలిస్తున్న రాజ్యసభ సభ్యుడు గొల్ల బాబూరావు

బుచ్చెయ్యపేట: సార్వత్రిక ఎన్నికల ప్రచారంలో భాగంగా ఈ నెల 29వ తేదీన చోడవరంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బహిరంగ సభ జరగనుందని ప్రభుత్వ విప్, చోడవరం వైఎస్సార్‌సీపీ అభ్యర్థి కరణం ధర్మశ్రీ చెప్పారు. శుక్రవారం బుచ్చెయ్యపేటలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ మండల నాయకులతో ఆయన సమీక్ష సమావేశం జరిపారు. సోమవారం ఉదయం 9 గంటలకే సభ జరుగుతుందని, సీఎంకు ఘన స్వాగతం పలకడానికి పార్టీ నాయకులు, కార్యకర్తలు 6 గంటలకే బయలుదేరాలన్నారు. ముఖ్యమంత్రి జగనన్న చేపడుతున్న పలు అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలకు ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారని, చోడవరంలో నిర్వహించే బహిరంగ సభకు అధిక సంఖ్యలో మహిళలు, రైతులు, యువకులు తరలివస్తారన్నారు. రెండోసారి ముఖ్యమంత్రిగా జగనన్నను గెలిపించడమే ధ్యేయంగా ప్రతి కార్యకర్త పనిచేయాలన్నారు. జెడ్పీటీసీ దొండా రాంబాబు, ఎంపీపీ దాకవరపు నాగేశ్వరిదేవి, పార్టీ మండల అధ్యక్షుడు కె.అచ్చింనాయుడు, వైస్ ఎంపీపీలు దొండా లలితా నారాయణమూర్తి, గొంపా చినబాబు, డీసీసీబీ మాజీ డైరెక్టర్ కోవెల జనార్దనరావు పాల్గొన్నారు.

పాయకరావుపేట సభకు స్థల పరిశీలన

పాయకరావుపేట: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి ఎన్నికల ప్రచారంలో భాగంగా వచ్చే నెల ఒకటో తేదీన పట్టణంలో పర్యటించనున్నారు. ఈ నేపథ్యంలో ఇక్కడ సూర్యామహల్ సెంటర్ వద్ద సీఎం బహిరంగ సభకు సంబంధించి ఏర్పాట్లను రాజ్యసభ సభ్యుడు గొల్ల బాబూరావు శుక్రవారం పరిశీలించారు. సీఎం హెలిప్యాడ్ కోసం స్థల పరిశీలన చేయనున్నారు. ఆయన వెంట జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ చిక్కాల రామారావు, పార్టీ జిల్లా ప్రచార విభాగం అధ్యక్షుడు దగ్గుపల్లి సాయిబాబా, జెడ్పీటీసీ లంక సూరిబాబు, ఎంపీపీ ఇసరపు పార్వతీ తాతారావు, ఉప సర్పంచ్ జగతా భవానీ శ్రీనివాస్, పంచాయతీ వార్డు సభ్యులు ధనిశెట్టి మహేష్, పిరాధి రాజు, జగతా శ్రీను ఉన్నారు.

మలేసియాకు విమాన సర్వీసు



కౌలాలంపూర్ నూతన సర్వీసును ప్రారంభిస్తున్న ఎయిర్‌పోర్టు డైరెక్టర్ రాజారెడ్డి

గోపాలపట్నం: విశాఖ విమానాశ్రయం నుంచి మరో అంతర్జాతీయ విమాన సర్వీసు శుక్రవారం ప్రారంభమైంది. ఎయిర్ ఆసియా విమానయాన సంస్థ విశాఖ నుంచి కౌలాలంపూర్‌కు అంతర్జాతీయ విమాన సర్వీసును ప్రారంభించింది. ఈ విమాన సర్వీసును ఎయిర్‌పోర్టు డైరెక్టర్ ఎస్.రాజారెడ్డి ప్రారంభించారు. ఈ విమానం కౌలాలంపూర్ నుంచి విశాఖకు రాత్రి 9.30 గంటలకు చేరుకుంటుంది. ఇక్కడి నుంచి 10 గంటలకు బయలుదేరి, తెల్లవారుజామున 4.20 గంటలకు కౌలాలంపూర్ వెళ్తుంది. ఈ సర్వీసు బుధవారం, శుక్రవారం, ఆదివారం ఉంటుంది. ఈ సందర్భంగా రాజారెడ్డి మాట్లాడుతూ విశాఖ విమానాశ్రయం నుంచి నడుస్తున్న అంతర్జాతీయ సర్వీసుల్లో ఇది మూడవదన్నారు. స్కూట్ ఎయిర్‌లైన్స్ ద్వారా సింగపూర్‌కు సోమ, బుధ, శుక్ర, శనివారాల్లో సర్వీసులు అందుబాటులో ఉన్నాయన్నారు. థాయ్ ఎయిర్ ఆసియా విమానయాన సంస్థ మంగళ, గురు, శనివారాల్లో బ్యాంకాక్‌కు సర్వీసులు నడుపుతోందన్నారు. ఇక విశాఖ విమానాశ్రయంలో ప్రయాణికుల సంఖ్య గణనీయంగా పెరుగుతోందన్నారు. గతేడాది కంటే 11.80 శాతం వృద్ధిని సాధించినట్లు చెప్పారు. 2023–24లో 27,22,542 మంది ప్రయాణికులు రాకపోకలు సాగించారన్నారు. ఇది ఆల్‌టైమ్ రికార్డని పేర్కొన్నారు. కస్టమ్స్ కమిషనర్ రవిశంకర్, తదితరులు పాల్గొన్నారు.

విజ్ఞాన ప్రపంచంలో ఏయూకు ప్రత్యేక స్థానం



కట్టమంచి విగ్రహానికి అంజలి ఘటించిన వీసీ ప్రసాదరెడ్డి, మాజీ వీసీలు

ఏయూ క్యాంపస్: విజ్ఞాన ప్రపంచంలో ఆంధ్ర విశ్వవిద్యాలయానికి ప్రత్యేక స్థానం ఉందని ఏయూ వీసీ ఆచార్య ప్రసాదరెడ్డి అన్నారు. శుక్రవారం ఏయూ 99వ వ్యవస్థాపక దినోత్సవం సందర్భంగా పరిపాలనా భవనం వద్దనున్న వ్యవస్థాపక వీసీ కట్టమంచి రామలింగారెడ్డి, మెయిన్ గేట్ వద్ద నున్న ఏయూ చిహ్నానికి పూలమాలలు వేశారు. అనంతరం సెనేట్ మందిరంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వీసీ మాట్లాడుతూ యువతను నిరంతరం ఉన్నతంగా తీర్చిదిద్దే బాధ్యతను వర్సిటీ సమర్థవంతంగా నిర్వహిస్తోందన్నారు. మాజీ వీసీలు బీల సత్యనారాయణ, జి.ఎస్.ఎన్.రాజు, వి.బాలమోహన్‌దాస్, పూర్వ విద్యార్థుల సంఘం ఉపాధ్యక్షుడు డాక్టర్ కుమార్‌రాజు, రిజిస్ట్రార్ ఆచార్య ఎం.జేమ్స్ స్టీఫెన్, ప్రిన్సిపాళ్లు, డీన్‌లు పాల్గొన్నారు.

ఉపాధికి ఊతం

- రోజు కూలి రూ.300కు పెంచిన ప్రభుత్వం
- ఏప్రిల్ 1 నుంచి అమలు



ఉపాధి పనులు చేస్తున్న మహిళలు

జిల్లాలో వివరాలు

మొత్తం జాబ్‌కార్డులు	:	2,77,582
మొత్తం కూలీలు	:	4,36,110
2024–25లో పనిదినాల లక్ష్యం	:	75 లక్షలు
ఏడాది కూలీలకు చెల్లించనున్న వేతనం	:	రూ.225 కోట్లు
పెరిగిన వేతనంతో పెరగనున్న లబ్ధి	:	రూ.21 కోట్లు

యలమంచిలి రూరల్: కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కూలీలకు వరంగా మారింది. ఈ పథకం ద్వారా చేపడుతున్న పనుల్లో పనిచేస్తున్న కూలీలకు 2024–25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఏప్రిల్ నెల నుంచి రోజువారీ వేతనం రూ.300 కు పెంచడంతో హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. గత ఆర్థిక సంవత్సరం (2023–24)లో రోజుకు వేతనంగా రూ.272 చెల్లించే వారు. తాజాగా ఈ ఆర్థిక సంవత్సరం నుంచి అదనంగా రూ.28 కలిపి దినసరి వేతనంగా రూ.300 చెల్లించనున్నారు. వ్యవసాయపనులు లేని మార్చి నుంచి జూన్ వరకు నాలుగు నెలల పాటు కూలీలకు ఉపాధి పనులు ఎంతగానో ఆదుకుంటున్నాయి. స్థానికంగా పనులు కల్పించడంతో వలసలకు అడ్డుకట్ట వేయడంతో పాటు ఈ సమయంలో ఉపాధి పనులకు వచ్చే కూలీల సంఖ్య కూడా ఎక్కువగానే ఉంటోంది. జిల్లాలోని 2,77,582 జాబ్ కార్డులున్నాయి. 4,36,110 మంది వేతనదారులు ఉపాధి పొందుతున్నారు. పెంచిన వేతనం ఈ నెల నుంచే అమలవుతోంది. దీంతో ఈ ఏడాది వేతనదారులకు రూ.21 కోట్ల లబ్ధి కలగనుంది. ఈ ఆర్థిక సంవత్సరంలో 75 లక్షల పనిదినాలు కల్పించాలని లక్ష్యంగా నిర్ణయించారు. ఈ ఏడాది కూలీలకు రూ.225 కోట్లు వేతనంగా చెల్లించనున్నారు.

ప్రస్తుతం ఎండలు అధికంగా ఉండడంతో ఉదయమే పనులకు వెళ్లి 11 గంటలకు ఇంటికి వచ్చేలా అధికారులు సూచనలు ఇచ్చారు. కూలీలు వడదెబ్బకు గురి కాకుండా ఓఆర్ఎస్ ప్యాకెట్లు, ప్రథమ చికిత్స పెట్టెలు అందుబాటులో ఉంచారు. గతంలో ప్రభుత్వం సూచించిన పనులే చేసేవారు. ప్రస్తుతం గ్రామంలో 250కి పైగా పనులు చేసుకోవడానికి వీలుంది.

పనుల గుర్తింపు ఇలా..

ఏటా అక్టోబర్ 2 నుంచి జనవరి 31వ తేదీ వరకు పనులు గుర్తిస్తారు. ప్రాధాన్యత క్రమంలో వాటి అమలులో పలు నిర్ణయాలు తీసుకుంటారు. గుర్తించిన పనులకు ప్రతి గ్రామ పంచాయతీలో గ్రామ సభల ద్వారా ఆమోదం పొందాలి. గ్రామ సభల్లో ప్రజాప్రతినిధులు, అధికారులు, కూలీల సూచనలు పరిగణలోకి తీసుకోవాలి. ఇలా చేయడంతో కూలీల సంఖ్య పెరగడంతోపాటు అభివృద్ధి పనులు ఎక్కువగా జరిగే అవకాశం ఉంది.

చేపట్టే పనులివే..

భూగర్భ జలాల పెంపే లక్ష్యంగా ఉపాధి పనుల్లో ఎక్కువ శాతం వర్షపు నీటి నిలువ పనులకే ప్రాధాన్యతనిస్తున్నారు.

చెరువులు,కుంటలు, సప్లయ్ చానళ్లు,ఫీడర్ చానళ్లలో పూడికతీత పనులు,కొండ చుట్టూ కింది భాగంలో ట్రెంచ్‌లు,పొలం సరిహద్దు కందకాలు, తోటల్లో రింగ్ ట్రెంచ్‌లు, శ్మశాన వాటికల అభివృద్ధి,పొలాలకు వెళ్లే రోడ్లకు మట్టి పనులు, భూసారం కొట్టుకుపోకుండా భూమి వాలుకు అడ్డుగా ట్రెంచ్‌ల ఏర్పాటు, జగనన్న కాలనీలో సోక్ పిట్ నిర్మాణం వంటివి చేపట్టవచ్చు. మొక్కలు నాటడం, చెరువుల్లో పూడిక తీసి పొలాలకు తరలించడం, మరుగుదొడ్లు, ఇంకుడు గుంతల నిర్మాణం, రోడ్లకు ఇరువైపులా పిచ్చి మొక్కలు తొలగించడం,రహదారుల అనుసంధానం,నీటి నిల్వ గుంతలు తీయడం ,కిచెన్ షెడ్‌ల నిర్మాణం తదితర 250 రకాల పనులు చేపట్టవచ్చు.


వేతనం పెంచడం సంతోషం



ఉపాధి హామీ పథకంలో పని చేసే వారికి వేతనం పెంచడం సంతోషంగా ఉంది.వ్యవసాయ పనులు లేనప్పుడు ఉపాధి పనులే మమ్మల్ని ఆదుకుంటున్నాయి.అధికారులు క్రమం తప్పకుండా పనులు కల్పిస్తున్నారు.వేతనం కూడా సకాలంలో అందుతోంది. గతంలో రోజు కూలీ రూ.272 వచ్చేది.కూలీల కష్టాలను అర్థం చేసుకుని కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు వేతనం పెంచడం ఉపాధి కూలీలందరికీ ప్రయోజనం చేకూర్చింది.

– వండల వరలక్ష్మి,ఉపాధి వేతనదారు,గోకివాడ

అడిగిన వారందరికీ పని



ఉపాధిహామీ పథకంలో భాగంగా అడిగిన ప్రతి ఒక్కరికీ పని కల్పిస్తున్నాం. జాబ్‌కార్డు ఉన్న ప్రతి ఒక్కరూ ఉపాధి పొందేలా ప్రణాళిక రూపొందించాం. గ్రామాల్లో ఇప్పటికే చేపట్టాల్సిన పనులు గుర్తించాం. క్షేత్రస్థాయిలో పనులపై అవగాహన కల్పిస్తూ కూలీల సంఖ్య పెరిగేలా చర్యలు తీసుకుంటున్నాం.ఏప్రిల్ నుంచి వేతనం పెరిగింది. సగటున ఒక కూలీకి రూ.300వరకు వేతనం వస్తుంది.ఉన్న ఊరిలోనే ఉపాధి పనులు చేపట్టేలా చర్యలు తీసుకోవడంతో వలసలు తగ్గాయి.

– ఇ.సందీప్, డ్వామా పీడీ

క్లుప్తంగా

గురుకులాల్లో ఐదో తరగతికి నేడు ప్రవేశ పరీక్ష

నర్సీపట్నం : ఎంజేపీ బీసీ గురుకులాల్లో ప్రవేశానికి శనివారం ప్రవేశ పరీక్ష నిర్వహిస్తున్నామని గురుకుల ప్రిన్సిపాల్, జిల్లా కన్వీనర్ ఎన్.వెంకటరెడ్డి తెలిపారు. 2024–25 విద్యా సంవత్సరానికి ఐదో తరగతిలో ప్రవేశానికి ఈ పరీక్ష నిర్వహిస్తున్నామన్నారు. 320 సీట్ల భర్తీకి జిల్లాలో ఐదు పరీక్షా కేంద్రాలు నర్సీపట్నం, అనకాపల్లి, తానం, చోడవరం, లింగరాజుపాలెంలో పరీక్షలు నిర్వహిస్తున్నామన్నారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్ష జరుగుతుందన్నారు.

నేటి నుంచి ఉత్తరాంధ్రలో షర్మిల ప్రచారం

సాక్షి, విశాఖపట్నం : ఎన్నికల ప్రచారంలో భాగంగా ఏపీ పీసీసీ అధ్యక్షురాలు షర్మిల ఉత్తరాంధ్రలో రెండు రోజుల పాటు పర్యటించనున్నారు. శనివారం ఉదయం 10 గంటలకు అనకాపల్లి జిల్లా పాయకరావుపేటలో, సాయంత్రం 4 గంటలకు అల్లూరి జిల్లా పాడేరులో, 7 గంటలకు అరకులో బహిరంగ సభల్లో పాల్గొననున్నారు. అరకులోనే రాత్రి బస చేయనున్నారు. 28న ఉదయం అరకు నుంచి బయల్దేరి విశాఖ చేరుకొని ఉత్తర నియోజకవర్గంలో ప్రచార సభలో పాల్గొని సాయంత్రం శ్రీకాకుళం జిల్లాలోని టెక్కలి, పలాసలో బహిరంగ సభల్లో షర్మిల ప్రసంగించనున్నారు.

శ్రీవారికి పట్టు వస్త్రాల సమర్పణ

కొమ్మాది: రుషికొండలో గల శ్రీ మహాలక్ష్మి గోదాదేవి సహిత శ్రీ వేంకటేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం వారాంతపు పూజలు వైభవంగా నిర్వహించారు. శ్రీవారికి శేషవస్త్రం, అభిషేక సామగ్రిని అర్చకులు మంగళవాయి ద్యాల నడుమ తీసుకెళ్లి అభిషేకాలు నిర్వహించి అలంకరించారు. భక్తులకు దర్శనం కల్పించారు.

టీడీపీ మునిగిపోయే నావ

- 50 మంది వైఎస్సార్‌సీపీలో చేరిక
- కండువా కప్పి ఆహ్వానించిన కంబాల జోగులు


నల్లమట్టిపాలెంలో వైఎస్సార్‌సీపీలో చేరిన టీడీపీ నాయకులు


తగరంపూడి టీడీపీ సీనియర్ నాయకుడు రామచంద్రరావుకు వైఎస్సార్ సీపీ కండువా వేస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి మలసాల భరత్‌కుమార్


వెంకటరాజుపురం నుంచి పార్టీలో చేరిన వారితో మాడుగుల ఎమ్మెల్యే అభ్యర్థి ఈర్లె అనురాధ

నక్కపల్లి : మండలంలో బుచ్చిరాజుపేట పంచాయతీ శివారు నల్లమట్టిపాలెంలో సుమారు 50 మంది తెలుగుదేశంపార్టీకి రాజీనామా చేసి శుక్రవారం రాత్రి వైఎస్సార్‌సీపీలో చేరారు. గ్రామ ఉప సర్పంచ్ నల్లమట్టి ఝాన్సీ, టీడీపీ గ్రామ శాఖ అధ్యక్షుడు కాళ్ల సత్తిబాబు, టీడీపీ నాయకులు నల్లమట్టి కేశవ, కొల్లి నర్సింహమూర్తి, మామిడి బాబ్జి, మామిడి శ్రీను, నల్లమట్టి రాజారావు, ఎస్.రమణ, ఎస్.లోవరాజులు తమ కుటుంబాలతో సహా వైఎస్సార్‌సీపీలో చేరారు. వీరందరికి ఎమ్మెల్యే అభ్యర్థి కంబాల జోగులు, కాపు కార్పొరేషన్ డైరెక్టర్ వీసం రామకృష్ణ తదితరులు కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. వైఎస్సార్‌సీపీలో చేరిన నాయకులు మాట్లాడుతూ అభివృద్ధిని అడ్డుకోవడానికే టీడీపీ పనిచేస్తోందని, వచ్చే ఎన్నికల్లో మళ్లీ ప్రజలను మోసం చేయాలని కుట్రలు చేస్తోందన్నారు. జగనన్న ప్రవేశ పెట్టిన పథకాల వల్ల తాము కూడా లబ్ధి పొందామన్నారు. జగనన్న వంటి గొప్ప వ్యక్తిని మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకోకపోతే రాష్ట్రం దుర్మార్గుల పాలనలో అధోగతి పాలవుతుందన్నారు. అనంతరం చందనాడ, ఎస్.నర్సాపురం గ్రామాల్లో అభ్యర్థి జోగులు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. జెడ్పీటీసీ సభ్యురాలు గోసల కాసులమ్మ, ఎంపీటీసీలు గంటా తిరుపతిరావు, లొడగల చంద్రరావు, సర్పంచ్‌లు తళ్ల భార్గవ్, సురేష్‌వర్మ, బీసీ సెల్ అధ్యక్షుడు గొర్ల బాబూరావు పాల్గొన్నారు.

తగరంపూడిలో..

అనకాపల్లి : వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి మలసాల భరత్‌కుమార్ సమక్షంలో తగరంపూడిలో శుక్రవారం టీడీపీ సీనియర్ నాయకుడు యాదగిరి రామచంద్రరావుతో పాటు 20 మంది వైఎస్సార్‌సీపీలో చేరారు. ఈ సందర్భంగా మలసాల మాట్లాడుతూ పార్టీ కోసం కష్టపడి పనిచేసిన ప్రతి వ్యక్తికి పార్టీలో మంచి గుర్తింపు ఉంటుందన్నారు. పార్టీలో చేరిన యాదగిరి రామచంద్రరావు మాట్లాడుతూ 20 ఏళ్లుగా టీడీపీ కోసం శక్తివంచన లేకుండా కృషి చేసినప్పటికీ గుర్తింపు లేకపోవడమే కాకుండా ఈసారి సార్వత్రిక ఎన్నికల్లో అనకాపల్లిలో సైకిల్ గుర్తు లేకపోవడంతో టీడీపీ నేతలు తీవ్ర ఒత్తిడికి గురౌవుతున్నట్లు తెలిపారు. ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి పాలనలో గ్రామాలు అభివృద్ధి చేయడంతో గ్రామీణ ప్రజలకు మరోసారి సీఎంగా జగన్ మోహన్‌రెడ్డిని గెలిపించుకునేందుకు సిద్ధంగా ఉన్నారని అన్నారు.

మరోరెండు మూడు రోజుల్లో గ్రామాల నుంచి పెద్ద ఎత్తున యువత వైఎస్సార్‌సీపీలోకి చేరేందుకు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలోకి చేరిన యాదగిరి బాబ్జి, బొడ్డు కనక, గంట పోలినాయుడు, గొలగాన భాస్కరరావు, ఏసు, హరి, ముమ్మిన ఈశ్వరరావుతో పాటు మరో 13 మందికి పార్టీ కండువాను భరత్‌కుమార్‌వేసి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ గొర్లి సూరిబాబు, మండలపార్టీ అధ్యక్షుడు పెదిశెట్టి గోవింద్, సర్పంచ్ యాదగిరి అప్పారావు, వైస్ ఎంపీపీ అయితా ఆనందరాము, గ్రామపార్టీ అధ్యక్షుడు ఎన్నంశెట్టి సత్యనారాయణ, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

వెంకటరాజుపురంలో...

దేవరాపల్లి : మండలంలోని వెంకటరాజుపురం నుంచి మూడు టీడీపీ కుటుంబాలు వైఎస్సార్‌సీపీ తీర్థం పుచ్చుకున్నాయి. ఈ మేరకు తారువలో వెంకటరాజుపురం గ్రామానికి చెందిన గోగాడ దేముడు నాయుడు, గుల్లేపల్లి శ్రీరామ్, రెడ్డి ముసలినాయుడు కుటుంబాలు శుక్రవారం వైఎస్సార్‌సీపీలో చేరగా మాడుగుల ఎమ్మెల్యే అభ్యర్థి ఈర్లె అనురాధ పార్టీ కండువాలను వేసి సాదరంగా ఆహ్వానించారు. ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పాలన, నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటూ కష్ట సుఖాల్లో అండగా నిలిచే డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు నాయకత్వానికి ఆకర్షితులమై పార్టీలో చేరామని వారు స్పష్టం చేశారు. ప్రస్తుతం జరిగే ఎన్నికల్లో ఎంపీగా ముత్యాలనాయుడును, ఎమ్మెల్యే అనురాధను భారీ మెజార్టీతో గెలిపించేందుకు కష్టపడి పని చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బూరె బాబురావు, వెంకటరాజుపురం సర్పంచ్ దాసరి సంతోష్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వ్యక్తి ప్రాణాలు కాపాడిన పోలీసులకు అభినందనలు


కారులో అపస్మారక స్థితిలో సత్యప్రసాద్

విశాఖ: కారునడుపుతూ అపస్మారక స్థితికి చేరుకున్న వ్యక్తిని సకాలంలో స్పందించి కాపాడిన కంచరపాలెం పోలీసులను నగర పోలీస్ కమిషనర్ ఎ.రవిశంకర్ శుక్రవారం అభినందించారు. గురువారం అర్ధరాత్రి మురళీనగర్ వర్మ కాంప్లెక్స్ వద్ద ఓ వ్యక్తి కారులో వెళ్తూ మధ్యలో కారు ఆపేసి అస్వస్థతకు గురి కావడం అటుగా వెళ్తున్న కొందరు గమనించి 112 ద్వారా పోలీసులకు సమాచారం అందించారు. తక్షణం స్పందించిన కంట్రోల్ రూం సిబ్బంది కంచరపాలెం పోలీసులను అప్రమత్తం చేశారు. కంచరపాలెం ఎస్‌ఐ రవికుమార్, నైట్ బీట్ కానిస్టేబుల్ అప్పలనాయుడు, సంతోష్ ఘటనా స్థలానికి చేరుకున్నారు. డ్రైవింగ్ సీటులో ఉన్న వ్యక్తిని లేపడానికి ప్రయత్నించారు. అతను ఎంతకీ లేవకపోవడంతో కారు అద్దం పగులగొట్టి, అతనికి ప్రాథమిక చికిత్స అందించి దగ్గరలో ఉన్న ఆస్పత్రిలో చేర్పించారు. అతని బంధువులకు సమాచారం అందించారు. సకాలంలో స్పందించి వ్యక్తి ప్రాణాలు కాపాడిన ఎస్‌ఐ, సిబ్బందిని పోలీస్ కమిషనర్ అభినందించి ప్రశంసాపత్రాలు అందించారు.

గవిరెడ్డి మోసాలను ప్రజలకు వివరిస్తా

- అధిష్టానం చర్యలు ఆమోదకరంగా లేవు
- టీడీపీ రెబల్ ఎమ్మెల్యే అభ్యర్థి పైలా ప్రసాదరావు

కె.కోటపాడు : మాడుగులలో బండారును బలిపశువును చేసి, మాజీ ఎమ్మెల్యే గవిరెడ్డి రామానాయుడు చక్రం తిప్పుతున్నాడని టీడీపీ రెబల్ ఎమ్మెల్యే అభ్యర్థి పైలా ప్రసాదరావు అన్నారు. ఎ.కోడూరు గ్రామంలో శుక్రవారం రాత్రి పైలా ప్రసాదరావు ×నిజం గెలవాలి–న్యాయం జరగాలి× పేరిట సమావేశాన్ని జరిపారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నియోజకవర్గంలో 15 ఏళ్లుగా టీడీపీ పటిష్టతకు కృషి చేశానని, అధిష్టానం ఈ ఎన్నికల్లో తనకు మాడుగుల టీడీపీ టిక్కెట్‌ను కేటాయిస్తే.. తన వద్ద డబ్బులు లేవని, పెందుర్తి మాజీ ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తికి టికెట్‌ను ఇస్తే గెలిపించి తీసుకువస్తామని ప్యాకేజీ స్టార్‌లు గవిరెడ్డి, పీవీజీకుమార్ అధిష్టానానికి చెప్పి తన టికెట్‌ను మార్చారని అన్నారు. తీరా గవిరెడ్డి ఎమ్మెల్యే అభ్యర్థిగా తాను కూడా నామినేషన్ వేశారంటే బండారును మోసం చేసేందుకే కదా? అని ప్రశ్నించారు. తనతో పాటు గవిరెడ్డి, పీవీజీ కుమార్‌లు మాడుగుల, గొండుపాలెం గ్రామాల్లో గతంలో ముగ్గురిలో ఎవరికి టికెట్ వచ్చినా గెలుపునకు కృషి చేస్తామని ప్రమాణాలను చేసుకున్నామని, ఇపుడు నా సీటును మార్చిన వీరు దేవునిపై చేసిన ప్రమాణాలు ఏమయ్యాయని ప్రశ్నించారు. నియోజకవర్గంలో గవిరెడ్డి మోసాలను ప్రజలకు వివరించి ఆయనను తిరగనివ్వకుండా చేస్తానన్నారు. మరో రెండు రోజుల పాటు పార్టీ నిర్ణయం కోసం వేచి చూసి, అనంతరం తన నిర్ణయాన్ని ప్రకటిస్తానన్నారు. కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు రొంగలి మహేష్, ఎ.కోడూరు సర్పంచ్ బొడ్డు అక్కునాయుడు, సింగంపల్లి నారాయణమూర్తి, బండారు లక్ష్మణరావు, బండారు నరసింహనాయుడు, కొట్యాడ నారాయణమూర్తి పాల్గొన్నారు.


మాట్లాడుతున్న టీడీపీ రెబల్ ఎమ్మెల్యే అభ్యర్థి పైలా ప్రసాదరావు

జగన్ పాలనలోనే పద్మశాలీలకు గుర్తింపు

- వైఎస్సార్‌సీపీ చేనేత విభాగం జిల్లా అధ్యక్షుడు సూరి అప్పారావు

రావికమతం : రాష్ట్రంలో పద్మశాలి చేనేతలకు గుర్తింపు తెచ్చిందీ, రాజకీయంగా రెండు ఎమ్మెల్యే టిక్కెట్లు, ఒక ఎంపీ టిక్కెట్ ఇచ్చిందీ ముఖ్యమంత్రి జగన్‌మోహనరెడ్డేనని వైఎస్సార్‌సీపీ చేనేత విభాగం జిల్లా అధ్యక్షుడు మాడెం సూరి అప్పారావు అన్నారు. కొత్తకోట మాజీ సర్పంచ్ బేతా రాజారావు, గ్రామంలో ఉన్న మరికొందరు ఆ సంఘ సభ్యులను శుక్రవారం కలిసి సీఎం జగన్‌మోహన్ రెడ్డి చేనేతలకు చేసిన మేలును వివరించారు. టీడీపీ, జనసేన తమకు టిక్కెట్లు ఇస్తామని హామీ ఇచ్చి మోసం చేశాయన్నారు. జగన్‌మోహనరెడ్డి మంగళగిరి ఎమ్మెల్యే తమ చేనేత ముద్దుబిడ్డ మురుగుడు లావణ్యకు, ఎమ్మిగనూరు టిక్కెట్ బుట్టా రేణుకకు ఇచ్చారని, అలాగే గతంలో సింగరి సంజీవ్‌కుమార్‌ను ఎంపీగా గెలిపించారన్నారు. చేనేతలకు ఆర్థికంగా అండగా నిలవడమే కాక రాజకీయాభివృద్ధికి ఎనలేని కృషి చేస్తున్న జగన్‌మోహనరెడ్డి ప్రభుత్వానికి రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న 20 లక్షల మంది చేనేతలు అండగా ఉన్నారని, మనమూ ఆ బాటలోనే నడిచి అనకాపల్లి జిల్లాలోని వైఎస్ఆర్ కాంగ్రెస్‌పార్టీ అభ్యర్థులను గెలిపించుకోవాలని కోరారు.

ఈ కార్యక్రమంలో ఆ సంఘ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పప్పు వెంకట రమణ, జిల్లా ప్రధాన కార్యదర్శి సురేష్, మండల సంఘం అధ్యక్షుడు సిహెచ్. సత్యారావు పలువురు పాల్గొన్నారు.


కొత్తకోట మాజీ సర్పంచ్ బేతా రాజారావును కలిసి ప్రభుత్వం చేసిన సహాయాన్ని వివరిస్తున్న అప్పారావు తదితరులు


అభిమాన హారతులు : నక్కపల్లి మండలం జానకయ్యపేటలో పాయకరావుపేట అభ్యర్థి కంబాల జోగులుకు హారతులిస్తున్న మహిళలు


మీరే మా స్టార్ క్యాంపెయినర్లు : నర్సీపట్నం 13వ వార్డులో ఎన్నికల ప్రచారం సందర్భంగా మహిళలతో వైఎస్సార్‌సీపీ అభ్యర్థి గణేష్


సతీ'ధర్మ'ం పాటిస్తూ : రావికమతం మండలం కొత్తకోటలో చోడవరం ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీకి మద్దతుగా ఓటు అభ్యర్థిస్తున్న ధర్మశ్రీ సతీమణి విజయ


అనకాపల్లి లక్ష్మీదేవిపేటలో ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి మలసాల భరత్‌కుమార్, ఎంపీ సత్యవతి, ప్రసన్నలక్ష్మి, కాశీవిశ్వనాథం

పిల్లల ఉన్నతిని చూడలేకపోయాం..

- అచీవర్స్‌డేకు అనుమతి నిరాకరణపై తల్లిదండ్రుల అసంతృప్తి
- మంచి అవకాశం కోల్పోయామంటూ విద్యార్థుల ఆవేదన

ఏయూక్యాంపస్: ఆంధ్ర విశ్వవిద్యాలయంలో శుక్రవారం నిర్వహించ తలపెట్టిన అచీవర్స్‌డేకు అనుమతి నిరాకరణపై తల్లిదండ్రులు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. తమ పిల్లల జీవితంలో ఒక అపురూపమైన ఘట్టాన్ని చూడలేకపోయామని ఆవేదన వ్యక్తం చేశారు. శుక్రవారం సుదూర ప్రాంతాల నుంచి వచ్చిన పలువురు తల్లిదండ్రులు ఏయూ సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ కార్యాలయానికి వచ్చి అధికారులతో మాట్లాడారు. విద్యకు సంబంధించిన కార్యక్రమంపై పలు పత్రికల్లో వచ్చిన అసత్య కథనాలను సాకుగా చూపుతూ అనుమతి రద్దు చేయడం సమంజసం కాదని వారు అభిప్రాయపడ్డారు. పలువురు విద్యార్థులు సైతం అసంతృప్తి, అసహనం వ్యక్తం చేశారు.

కుటుంబంతో వచ్చాం..



వర్సిటీలో జరిగే కార్యక్రమంలో పాల్గొనడానికి మా కుటుంబంతో కలిసి వచ్చాం. అధికారులు ఎంతో కష్టపడి విద్యార్థులకు ఉద్యోగాలు వచ్చేలా కృషి చేశారు. వారికి పరీక్షలు అయిపోతున్నాయి, ఉద్యోగాలలో చేరిపోతారు. మళ్లీ అచీవర్స్‌డే నిర్వహించడం సాధ్యమయ్యే విషయం కాదు.

– పి.రత్నకుమార్‌స్వామి, పాయకరావుపేట

అచీవర్స్‌డే రద్దు బాధేసింది..



గతంలో ఎప్పుడూ తల్లిదండ్రులకు సన్మానం చేసే కార్యక్రమం, అవకాశం రాలేదు. అచీవర్స్‌డేలో నా తల్లిదండ్రులను సత్కరించాలని అనుకున్నాను. మంచి కార్యక్రమం నిర్వహిస్తున్నందుకు ముందు ఎంతో సంతోషంగా ఫీల్ అయ్యాను. చివరి నిమిషంలో అనుమతి నిరాకరించారని తెలిసి బాధేసింది. అధికారులు పూర్తిగా పరిశీలించి నిర్ణయం తీసుకుని ఉండాల్సింది.

– పి.ఆర్.ఎస్.వరప్రసాద్, స్టాటస్టిక్స్ విభాగం విద్యార్థి

కన్నీటితో వెనుతిరిగారు..



తమ పిల్లల భవిష్యత్తును కళ్లారా చూడాలని ఆశతో ఎంతో దూర ప్రాంతాల నుంచి తల్లిదండ్రులు వచ్చారు. అచీవర్స్‌డేకు అనుమతి రద్దు చేశారని తెలిసి కన్నీటితో వెనుతిరిగారు. పక్కనే ఉన్న గీతం వర్సిటీలో ఇటువంటి కార్యక్రమాలు స్వేచ్ఛగా జరుపుకొంటున్నారు. గీతంకు ఒక న్యాయం, ఏయూకు ఒక న్యాయమా?

– సిహెచ్.ధనరాజ్, విద్యార్థిని తండ్రి

అక్రమంగా తరలిస్తున్న 48 ఎద్దులు స్వాధీనం

కశింకోట: కంటైనర్‌లో అక్రమంగా తరలిస్తున్న 48 ఎద్దులను శుక్రవారం స్థానిక పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. సీఐ ఎం.వినోద్‌బాబు అందించిన వివరాల ప్రకారం..విజయనగరం జిల్లా పెదమానాపురం సంతలో ఎద్దులను కొనుగోలు చేసి కంటైనర్‌లో చిలకలూరిపేటకు తరలిస్తుండగా ముందుగా అందిన సమాచారం మేరకు నిఘా వేసి కశింకోట వద్ద పట్టుకున్నారు. వీటిని కబేళాకు తరలిస్తున్నారని, ఇద్దరు కంటైనర్ డ్రైవర్లను అదుపులోకి తీసుకున్నామని సీఐ తెలిపారు. స్వాధీనం చేసుకున్న ఎద్దులను గోశాలకు తరలించినట్టు ఆయన తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు సీఐ చెప్పారు.

విద్యుత్ స్తంభాన్ని ఢీకొట్టిన వ్యాన్

రావికమతం : చినపాచిల ఎస్సీ కాలనీ వద్ద టాటా ఏస్ వాహనం, విద్యుత్ స్తంభాన్ని శుక్రవారం బలంగా ఢీకొంది. దీంతో స్తంభం విరిగి పడిపోయింది. విద్యుత్ వైర్లు ఒకటికొకటి కలిసిపోయి నిప్పులు రాజుకున్నాయి. అయితే ఎవరికీ ఏ విధమైన ప్రమాదం జరగలేదు. రావికమతం నుంచి వచ్చిన ఆ వాహనం చినపాచిల కాలనీ వద్ద మలుపు తిప్పుతుండగా అదుపు తప్పి స్తంభాన్ని ఢీకొంది. స్తంభం విరిగి వైర్ల నుంచి నిప్పులు రావడంతో డ్రైవర్ రాముడు వాహనం నుంచి దూకి ప్రాణాలు రక్షించుకున్నాడు. అక్కడ ఉన్న ప్రజలు సైతం దూరంగా పరుగులు తీయడంతో ఎవరికీ ఏవిధమైన నష్టం జరగలేదు.

కొబ్బరిచెట్టుపై నుంచి కింద పడి కూలీ మృతి

కశింకోట: స్థానిక శారదానది అవతల కొబ్బరి చెట్టుపై నుంచి కింద పడి ఒడిశా కూలీ శుక్రవారం మృతి చెందాడు. సీఐ ఎం.వినోద్‌బాబు అందించిన వివరాల ప్రకారం.. మూడు నెలల క్రితం ఇక్కడ ఇటుకల తయారీ బట్టీలో పని చేయడానికి ఒడిశాకు చెందిన గిరిధర్ సంత (49) వచ్చాడు. ఇక్కడి సంతలో కూరగాయలు కొనుగోలు చేసుకొని తిరిగి ఇటుకల బట్టీకి వెళుతూ మధ్యలో కొబ్బరి కాయల కోసం చెట్టు ఎక్కి ప్రమాదవశాత్తు జారి కింద పడి మృతి చెందాడు. మృతుడి సోదరుడు రఘు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, మృతుని మృతదేహాన్ని పోస్టుమార్టానికి అనకాపల్లి వంద పడకల ఆస్పత్రికి తరలించినట్టు సీఐ తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఆయన చెప్పారు.

28 మద్యం బాటిళ్లు స్వాధీనం


పట్టుబడిన మద్యంతో ఫ్లయింగ్ స్క్వాడ్ బృందం

ఎస్.రాయవరం: వమ్మవరంలో అక్రమంగా మద్యం బాటిళ్లు తరలిస్తున్న ఇద్దరిని పోలీసులు పట్టుకున్నారు మద్యం బాటిళ్లు తరలిస్తున్నారన్న సమాచారంతో ఎన్నికల ఫ్లయింగ్ స్క్వాడ్ సభ్యులు పి.వి.ఎల్.ఎస్. గంగాధర్, కె.సూర్యకుమారి, ఎస్.వి.ప్రసాద్‌రావు, బి.నాగకార్తీక్, ఎం.రమణ, శ్రవణ్‌కుమార్ దాడిచేసి పట్టుకున్నారు. నిందితుల నుంచి మొత్తం 28 మద్యం బాటిళ్లు స్వాధీనం చేసుకుని, ఎస్.రాయవరం పోలీస్ స్టేషన్‌కు తరలించారు.

వివాహిత అనుమానాస్పద మృతి

- భర్తపై మృతురాలి సోదరుడి ఫిర్యాదు
- పొట్టిదొరపాలెంలో ఘటన
- కేసు దర్యాప్తు చేస్తున్న పోలీసులు

బుచ్చెయ్యపేట: మండలంలోని పొట్టిదొరపాలెంలో రామాల పూర్ణ(27) అనే వివాహిత అనుమానాస్పదంగా మృతి చెందింది. గురువారం రాత్రి 10 గంటల సమయంలో గ్రామ శివారు సరుగుడు తోటలో ఆమె శవమై తేలింది. పూర్ణ భర్త సత్తిబాబుపై అనుమానం ఉన్నట్టు మృతురాలి సోదరుడు బోరా రమణ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కొత్తకోట సీఐ అప్పలనాయుడు, బుచ్చెయ్యపేట ఎస్‌ఐ ఈశ్వరరావు తమ సిబ్బందితో సంఘటన స్థలానికి వెళ్లి పరిశీలించి, విచారణ చేపట్టారు. గ్రామస్తుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. సత్తిబాబు,పూర్ణ గత కొద్ది కాలంగా గొడవలు పడి పొట్టిదొరపాలెం లోనే వేర్వేరుగా నివాసం ఉంటున్నారు. వీరికి ఆరు, ఎనిమిదేళ్ల వయస్సు గల బాబు,పాప ఉన్నారు. పూర్ణకు వివాహేతర సంబంధం ఉన్నట్టు సత్తిబాబుకు అనుమానం ఉంది. రాత్రి తొమ్మిదిన్నర గంటల ప్రాంతంలో పూర్ణ గ్రామ పొలిమేర వద్ద ఉన్న సరుగుడు తోటలోకి వెళ్లింది. పూర్ణ సరుగుడు తోటలోకి వెళ్లడం గమనించిన సత్తిబాబు ఆమెను వెంబడించాడు. అక్కడ పూర్ణ ఒక్కర్తే ఉండగా, దగ్గరలోనే ద్విచక్ర వాహనం ఉంది. ద్విచక్ర వాహనం ఎవరిదని సత్తిబాబు ప్రశ్నించాడు. అనంతరం భార్యపై అనుమానంతో అక్కడే గొడవకు దిగాడు. ఇద్దరి మధ్య గొడవ జరగగా సత్తిబాబు ఆవేశంతో పూర్ణపై దాడి చేసి, కొట్టడంతో ఆమె అక్కడికక్కడే మృతి చెందినట్టు తెలుస్తోంది. పూర్ణ మృతి చెందిన విషయాన్ని ఆమె కుటుంబ సభ్యులకు సత్తిబాబు తెలిపాడు. మృతురాలి సోదరుడు బోరా రమణ ఫిర్యాదు మేరకు పోలీసులు పూర్ణ మృతదేహాన్ని అనకాపల్లి ఏరియా ఆస్పత్రికి తరలించి శుక్రవారం పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు.

సంఘటన స్థలంలో ఉన్న ద్వి చక్ర వాహనాన్ని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ద్వి చక్ర వాహనం బంగారుమెట్టకు చెందిన యువకుడిదిగా పోలీసులు గుర్తించినట్టు తెలుస్తోంది. కొత్తకోట సీఐ అప్పలనాయుడు, ఎస్‌ఐ ఈశ్వరరావుల కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నారు.

క్లుప్తంగా

ఘనంగా గౌరీ పరమేశ్వరుల ఊంజల్ సేవ



గౌరీపరమేశ్వరులకు ఊంజల్ సేవ నిర్వహిస్తున్న భక్తులు

అనకాపల్లి: స్థానిక గవరపాలెం గౌరీపంచాయతన దేవస్థానంలో గౌరీ పరమేశ్వరుల 191వ ఊంజల్ సేవా కార్యక్రమం శుక్రవారం ఘనంగా జరిగింది. ఈ కార్యక్రమంలో కాండ్రేగుల మురళీకృష్ణ చంద్రకళ దంపతులచే ఆలయ అర్చకులు అంపోలు గోపాలకృష్ణ శర్మ, కొందూరు సూర్యనారాయణశాస్త్రి, శేషు,సాయిలు ప్రత్యేక పూజలు చేయించారు. గౌరీ, గీత మహిళామండలి, శ్రీ సత్తెమ్మతల్లి దేవస్థానం మహిళామండలి, తిమ్మాపాత్రుని చక్రవర్తి ఆధ్వర్యంలో అన్నమాచార్య వాగ్గేయ వరదాయని బృందం సభ్యులు శివకీర్తనలు ఆలపించి, జానపద నృత్యాలు చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధ్యక్షుడు కర్రి సన్యాసినాయుడు, కార్యదర్శి బొడ్డేడ రామ సత్యనారాయణ, కోశాధికారి శరగడం జగదీష్ తదితరులు పాల్గొన్నారు.

జోరుగా బీఎస్పీ ప్రచారం



ప్రచారం చేస్తున్న బీఎస్పీ ఎమ్మెల్యే అభ్యర్థి సూదికొండ మాణిక్యాలరావు

అనకాపల్లి: బీఎస్పీ అనకాపల్లి ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేస్తున్న సూదికొండ మాణిక్యాలరావు స్థానిక నెహ్రూచౌక్ జంక్షన్ వద్ద శుక్రవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మే 13న జరిగే సార్వత్రిక ఎన్నికల్లో ఏనుగు గుర్తుపై ఓటు వేసి, తనను గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో బీఎస్పీ నాయకులు పాల్గొన్నారు.

జూనియర్ లైన్‌మన్ కుటుంబాన్ని ఆదుకోవాలి

అనకాపల్లి: మునగపాక మండలం చూచుకొండలో విద్యుత్‌షాక్‌తో మృతిచెందిన ఆశాఖ జూనియర్ లైన్‌మన్ పీతల శివసూర్యనారాయణ కుటుంబంలో ఓ వ్యక్తికి ఉద్యోగం కల్పించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి దొరబాబు కోరారు. స్థానిక ఏఐటీయూసీ కార్యాలయంలో శుక్రవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈవిషయమై అధికారులు తక్షణమే స్పందించాలని, సూర్యనారాయణ కుటుంబాన్ని ఆదుకోవాలని కోరారు.

అనకాపల్లి సినిమాలు

ప్రాజెక్టు	: రాజా
పారిజాత పర్వం	: సత్యనారాయణస్క్రీన్-1
టెనెంట్	: సత్యనారాయణస్క్రీన్-2
గీతాంజలి	: షిర్డీసాయి
ఫ్యామిలీ స్టార్	: పర్తిసాయి
రత్నం	: వెంకటేశ్వర
పారిజాత పర్వమ్ల	: శ్రీసత్య
డీజే టిల్లు-2	: రామచంద్ర

బెల్లం ధరలు



అనకాపల్లి మార్కెట్‌కు శుక్రవారం 6,034 బెల్లం దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
మొదటి రకం	3,560	4,390
రెండో రకం	3,450	4,060
మూడోరకం	2,270	3,510

రక్త నిల్వలు

అనకాపల్లి: ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 61 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఎ పాజిటివ్-12 యూనిట్లు, బి పాజిటివ్-21 యూనిట్లు, ఒ పాజిటివ్-26 యూనిట్లు, ఏబీ పాజిటివ్-2 యూనిట్ల శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయం బ్లడ్ బ్యాంకు టెక్నీషియన్ యు.లోకేష్ (ఫోన్ నంబర్ 9703619706)ను సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లి: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా శుక్రవారం 351మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 210 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ (ఫోన్ నంబర్ 08924 223595)ని సంప్రదించవచ్చు.

హోరెత్తిన ప్రచారం

- టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలోకి 50 కుటుంబాల చేరిక



లక్ష్మీదేవిపేటలో ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి మలసాల భరత్‌కుమార్, ఎంపీ బీవీ సత్యవతి



టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలోకి చేరిన నాయకులతో ఎమ్మెల్యే అభ్యర్థి భరత్‌కుమార్, ఎంపీ సత్యవతి

అనకాపల్లి: అభివృద్ధి, సంక్షేమం సమపాళ్లలో అమలు చేస్తూ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలన సాగించారని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి మలసాల భరత్‌కుమార్ అన్నారు. స్థానిక 83వ వార్డు పరిధి లక్ష్మీదేవిపేటలో వార్డు కార్పొరేటర్ జాజుల ప్రసన్నలక్ష్మీ రమేష్ దంపతులు ఆధ్వర్యంలో శుక్రవారం విస్తృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. వైఎస్సార్‌సీపీ అభ్యర్థులకు ఓట్లు వేసి గెలిపించాలని ఇంటింటికీ వెళ్లి అభ్యర్థించారు. ముందుగా పేటలో మల్లమ్మ పేరంటాలమ్మను దర్శించుకున్నారు. బుద్ద వెంకటరావు ఆధ్వర్యంలో టీడీపీ నుంచి వైఎస్సార్‌సీపీలోకి చేరిన 50 కుటుంబాల వారికి కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం భరత్‌కుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలో జరిగిన అభివృద్ధి, అమలు చేసిన సంక్షేమ పథకాలను చూసి ఓటు వేయాలని కోరారు. బడుగు, బలహీన వర్గాల ప్రజలకు మరిన్ని సంక్షేమ పథకాలు అందాలంటే మరో సారి సీఎంగా జగన్‌మోహన్‌రెడ్డిని ఆశీర్వదించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీ బి.వి.సత్యవతి, నియోజకవర్గ పరిశీలకుడు బొడ్డేడ కాశీవిశ్వనాథం, పట్టణ మహిళా విభాగం అధ్యక్షురాలు ఎ.వి.రత్నకుమారి, పార్టీ సీనియర్ నేతలు జి.రామ్మూర్తి, బుద్ధ వెంకటరావు, రాపాక స్వామి, విష్ణుమూర్తి, శంకర్, యల్లపు నానాజీ, కొండలరావు, రాయవరపు జోగిరాజు, మళ్ల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.



82 వార్డులో ప్రచారం చేస్తున్న కార్పొరేటర్ మందపాటి సునీత, జానకీరామరాజు

అనకాపల్లి: స్థానిక 82వ వార్డు పరిధి ఆర్టీసీ కాంప్లెక్స్ రహదారిలో కార్పొరేటర్ మందపాటి సునీత, జానకీరామరాజులు శుక్రవారం ఇంటింటా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా సునీత మాట్లాడుతూ మే 13న జరిగే సార్వత్రిక ఎన్నికలో ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు బూడి ముత్యాలనాయుడు, మలసాల భరత్‌కుమార్‌లను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. పేదవానికి సంక్షేమ పథకాలు అందాలంటే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి మరోసారి పట్టం కట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నేతలు దాడి భోగలింగం, ఆడారి కిషోర్,గొన్నాబత్తుల వెంకటరమణ, కాండ్రేగుల సతీష్‌కుమార్, దాడి సూరిబాబు, పాలమరశెట్టి శ్రీను, పలకా సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

జగనన్నను మళ్లీ సీఎంగా ఆశీర్వదించాలి

- యలమంచిలి మున్సిపల్ చైర్‌పర్సన్ పిళ్లా రమాకుమారి



తులసీనగర్‌లో ప్రచారం చేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ పిళ్లా రమాకుమారి



వైఎస్సార్‌సీపీ అభ్యర్థులకు ఓటు వేయాలని అభ్యర్థిస్తున్న పిళ్లా రమాకుమారి

యలమంచిలి: రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమ పథకాలు కొనసాగాలంటే వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని మళ్లీ ముఖ్యమంత్రిగా ఆశీర్వదించాలని యలమంచిలి మున్సిపల్ చైర్‌పర్సన్ పిళ్లా రమాకుమారి అన్నారు. యలమంచిలి పట్టణం తులసీనగర్‌లో ఆమె శుక్రవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. స్థానిక వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలతో కలసి ఇంటింటికీ వెళ్లి విస్తృతంగా ప్రచారం చేశారు. ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి ఎమ్మెల్యే అభ్యర్థి యు.వి.రమణమూర్తిరాజు, ఎంపీ అభ్యర్థి బూడి ముత్యాలనాయుడులను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. రాష్ట్రంలో ప్రతి గడపకు జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలో సంక్షేమ పథకాలు అందాయని, యలమంచిలి మున్సిపాలిటీలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం హయాంలోనే పలు అభివృద్ధి పనులు జరిగాయని చెప్పారు. పనిచేసే ప్రభుత్వానికి మద్దతు పలకాలని ప్రజలను కోరారు. పేదలందరికీ టిడ్కో ఇళ్లు, జగనన్న కాలనీల ద్వారా ఉచితంగా ఇళ్లు మంజూరు చేసినట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ అగ్రెపు గుప్తా, కొక్కిరాపల్లి పీఏసీఎస్ అధ్యక్షుడు మళ్ల కొండబాబు, వైఎస్సార్‌సీపీ నాయకులు యల్లపు సూరి అప్పారావు,గొలగాని నాగు,జానకీరామ్ తదితరులు పాల్గొన్నారు.

మునగపాక: వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఈ ఐదేళ్లలో పలు అభివృద్ధి, సంక్షేమ పథకాలు అమలు చేసిందని, గ్రామాల రూపురేఖలు మార్చిందని ఎంపీపీ మళ్ల జయలక్ష్మి తెలిపారు. వైఎస్సార్‌సీపీ ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు బూడి ముత్యాలనాయుడు, యు.వి.రమణమూర్తి రాజులను గెలిపించాలని కోరుతూ స్థానిక ఇందిరమ్మ కాలనీలో శుక్రవారం ఇంటింటా ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మరో మారు వైఎస్ జగన్ మోహన్ రెడ్డిని సీఎంగా ఆశీర్వదించాలని అభ్యర్థించారు. యలమంచిలిలో వైఎస్సార్‌సీపీ జెండా ఎగిరేలా ప్రతి ఒక్కరూ సహకరించాలన్నారు. జెడ్పీటీసీ సభ్యుడు పెంటకోట స్వామి సత్యనారాయణ, సర్పంచ్ దిమ్మల అప్పారావు, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ ఆడారి అచ్చియ్యనాయుడు,సచివాలయాల మండల కన్వీనర్ పొలిమేర గణేష్, మాజీ జెడ్పీటీసీ మళ్ల సంజీవరావు,ఎంపీటీసీలు సూరిశెట్టి రాము,బోడకుర్తి గణేష్, పార్టీ నేతలు ఆడారి కాశీబాబు, పిల్లి అప్పారావు,టెక్కలి కొండలరావు,బొడ్డేడ మహేష్,ఉప సర్పంచ్ పెంటకోట సత్యనారాయణ,ఎంఎం నాయుడు,పంచాయతీ వార్డు సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

రాంబిల్లి: మండలంలోని పలు గ్రామాల్లో శుక్రవారం వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి ఎమ్మెల్యే అభ్యర్థి యు.వి. రమణమూర్తిరాజు, ఎంపీ అభ్యర్థి బూడి ముత్యాలనాయుడును గెలిపించాలని కోరుతూ ప్రచారం నిర్వహించారు. గోకివాడలో నియోజకవర్గ సచివాలయ కన్వీనర్ ఎస్.వి.సూర్యనారాయణ ఆధ్వర్యంలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. వాడనర్సాపురంలో సర్పంచ్ రామారావు, మండల సచివాలయ కన్వీనర్ రామకృష్ణ ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహించారు. పెదకలవలాపల్లి గ్రామంలో సర్పంచ్ కనకారావు ఆధ్వర్యంలో ప్రచారం నిర్వహించారు.



మునగపాక ఇందిరమ్మ కాలనీలో ఇంటింటా ప్రచారం చేస్తున్న వైఎస్సార్‌సీపీ శ్రేణులు



వాడనర్సాపురంలో ప్రచారం చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

‘చంద్రబాబును ప్రజలు ఎప్పటికీ నమ్మరు’

అనకాపల్లి: టీడీపీ అధికారంలో ఉన్న సమయంలో హామీలు నెరవేర్చని చంద్రబాబునాయుడును ప్రజలు ఎప్పటికీ నమ్మరని వైఎస్సార్‌సీపీ వైద్య విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బొడ్డేడ లక్ష్మీనర్సింహం శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. చంద్రబాబు.. హామీలను విస్మరించి మోసం చేయడం వల్లే 2019 ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకి ప్రజలు బ్రహ్మరథం పట్టారని పేర్కొన్నారు. ప్రత్యేక హోదా, పోలవరం ప్రాజెక్టు, రైల్వేజోన్, స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణపై విమర్శలు చేసేముందు చంద్రబాబు ఆలోచించుకోవాలని తెలిపారు. రాష్ట్ర భవిష్యత్తును నాశనం చేసేందుకు చంద్రబాబు కుయుక్తులు పన్నుతున్నారని, ప్రజలే ఓటుతో బుద్ధి చెప్పే రోజులు దగ్గరలో ఉన్నాయని పేర్కొన్నారు. రాష్ట్రాన్ని సీఎం జగన్‌మోహన్‌రెడ్డి అభివృద్ధి బాటలో నడిపిస్తుంటే ఓర్వలేక ప్రభుత్వంపై చంద్రబాబునాయుడు విషం కక్కుతున్నారని ఆరోపించారు. రాష్ట్రంలో విద్య, వైద్యానికి అధిక ప్రాధాన్యతను ఇస్తూ బలహీన వర్గాల అభివృద్ధికి కృషిచేస్తున్న జగన్‌ను సీఎంగా మరోసారి ప్రజలు గెలిపిస్తారని ఆయన తెలిపారు.

మండుతున్న ఎండలు

మునగపాక: కొద్ది రోజులుగా ఎండలు మండుతున్నాయి. వడగాడ్పులు వీయడంతో ప్రజలు అవస్థలు పడుతున్నారు. పిల్లలు, వృద్ధులు సతమతమవుతున్నారు. ఉదయం ఎనిమిది గంటల నుంచే వేడిగాలులు వీస్తున్నాయి. రాకపోకలు సాగించే వారు ఇబ్బందులు పడుతున్నారు. శుక్రవారం మధ్యాహ్నం సమయానికి మండలంలోని ప్రధాన కూడళ్లు, రహదారులు నిర్మానుష్యంగా మారాయి. నిత్యం వాహనాలతో రద్దీగా ఉండే మునగపాక బైపాస్ రోడ్డు నిర్మానుష్యంగా మారింది.

వైఎస్సార్ సీపీ విజయానికి కృషి



గవరపేటలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి మళ్ల బుల్లిబాబు



సమావేశానికి హాజరైన పార్టీ శ్రేణులు, అభిమానులు, ప్రజలు

కశింకోట: రానున్న ఎన్నికల్లో వైఎస్సార్ సీపీ విజయానికి అందరూ కృషి చేయాలని పార్టీ జిల్లా అధికార ప్రతినిధి మళ్ల బుల్లిబాబు కోరారు. కశింకోటలోని గవరపేట ప్రాంతంలో శుక్రవారం రాత్రి నిర్వహించిన వైఎస్సార్ సీపీ బూత్ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంక్షేమ పథకాలతో అన్ని వర్గాల ప్రజలకు లబ్ధి చేకూర్చారన్నారు. లబ్ధి పొందిన వారంతా ఎన్నికల్లో సంపూర్ణ సహకారం అందించాలని కోరారు. మళ్లీ వైఎస్సార్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే మరింతగా అభివృద్ధి జరుగుతుందని, పలు సంక్షేమ పథకాలను అమలు చేస్తారని చెప్పారు. మళ్లీ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం రాకుంటే సంక్షేమ పథకాలు రద్దు అవుతాయన్నారు. ఎంపీ అభ్యర్థి బూడి ముత్యాలనాయుడు, అసెంబ్లీ అభ్యర్థి మలసాల భరత్‌కుమార్‌లను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. సర్పంచ్ మంత్రి జయరజని, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు మంత్రి పీటర్ వైజ్‌మెన్ తదితరులు పాల్గొన్నారు.

బంగారయ్యపేటలో...

కశింకోట మండలం బంగారయ్యపేటలో శుక్రవారం రాత్రి వైఎస్సార్ సీపీ నాయకులు ప్రచార సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ గత ఐదేళ్లలో వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో చేసిన అభివృద్ధి, సంక్షేమ పథకాల గురించి వివరించారు. పార్లమెంట్ అభ్యర్థి బూడి ముత్యాలనాయుడు, అసెంబ్లీ అభ్యర్థి మలసాల భరత్‌కుమార్‌లను గెలిపించాలని కోరారు. ఈ సమావేశంలో పార్టీ యువజన విభాగం కార్యనిర్వాహక కార్యదర్శి లగిశెట్టి గణేష్, మాజీ సర్పంచ్ చిన్ని వల్లభనారాయణ రావు, పార్టీ నాయకులు చిన్ని రాజీవ్ తదితరులు పాల్గొన్నారు.



బంగారయ్యపేటలో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ యువజన విభాగం నాయకుడు లగిశెట్టి గణేష్

అనకాపల్లిలో ఒకరు... యలమంచిలిలో నలుగురు

నామినేషన్ల తిరస్కరణ



యలమంచిలిలో నామినేషన్ల పరిశీలనకు హాజరైన వివిధ పార్టీల దరఖాస్తుదారులు

యలమంచిలి రూరల్/అనకాపల్లి: సార్వత్రిక ఎన్నికల సంగ్రామ ప్రక్రియలో భాగంగా శుక్రవారం నామినేషన్ల పరిశీలన జరిగింది. అనకాపల్లిలో ఒకరి, యలమంచిలిలో నలుగురి నామినేషన్లను ఎన్నికల అధికారి తిరస్కరించారు.

అనకాపల్లి అసెంబ్లీ నియోజకవర్గ స్థానానికి 15 మంది అభ్యర్థులు నామినేషన్లు వేయగా స్క్రూటీనీలో శుక్రవారం ఎన్నికల రిటర్నింగ్ అధికారి, జేసీ ఎం.జాహ్నవి ఒక అభ్యర్థి నామినేషన్‌ను తిరస్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అనకాపల్లి పీలా వారి వీధికి చెందిన 23 సంవత్సరాల కామిరెడ్డి భరత్‌కుమార్ ఇండిపెండెంట్ అభ్యర్థిగా నామినేషన్ వేశారని చెప్పారు. కేంద్ర ఎన్నికల సంఘం నిబంధనల ప్రకారం ఎమ్మెల్యే అభ్యర్థికి 25సంవత్సరాలు ఉండాలని ఆమె చెప్పారు. అందువల్ల ఆయన నామినేషను తిరస్కరించినట్టు చెప్పారు. మిగిలిన 14మంది నామినేషన్లు ఆమోదం పొందినట్టు ఆమె తెలిపారు.

- యలమంచిలిలో మొత్తం 18 మంది 34 సెట్ల నామినేషన్లు దాఖలు చేశారు. వీరిలో నలుగురు దాఖలు చేసిన నామినేషన్లను ఆర్వో తిరస్కరించారు. ఎమ్మెల్యే కన్నబాబు తనయుడు సుకుమార వర్మ దాఖలు చేసిన నామినేషన్ పత్రాలకు వైఎస్సార్‌సీపీ తరపున ఏ,బీ ఫారాలు జతపరచకపోవడంతో నాలుగు సెట్లను తిరస్కరించారు. ఇండియన్ నేషనల్ కాంగ్రెస్ పార్టీ తరపున నామినేషన్లు దాఖలు చేసిన పెదపూడి రాము,సుందరపు ఈశ్వరరావులు ఏ,బీ ఫారాలు ఇవ్వలేకపోవడం, ఒక ప్రతిపాదితుడే నామినేషన్ పత్రాలపై సంతకాలు పెట్టడం వల్ల వారు దాఖలు చేసిన నామినేషన్లను తిరస్కరించినట్టు అధికారులు తెలిపారు.స్వతంత్ర అభ్యర్థిగా నామినేషన్ వేసిన దువ్వాడ విజయ్ కుమార్ 10 మంది ప్రతిపాదిత ఓటర్ల వివరాలను సక్రమంగా పూర్తిచేయకపోవడంతో అతని నామినేషన్‌ను కూడా తిరస్కరించారు. నామినేషన్ల పరిశీలన తర్వాత మొత్తం 14 మంది నామినేషన్లు చెల్లుబాటు అయినట్టు అధికారులు ప్రకటించారు. పరిశీలన సందర్భంగా అన్ని రాజకీయపార్టీలకు చెందిన ప్రతినిధులు ఆర్వో కార్యాలయానికి హాజరై ప్రక్రియను స్వయంగా పరిశీలించారు.ఎలాంటి వివాదాలు జరగకుండా పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.

పట్టణాలకు దీటుగా పల్లెల అభివృద్ధి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే అభ్యర్థి మలసాల భరత్‌కుమార్



మామిడిపాలెంలో జరిగిన సమావేశంలో పాల్గొన్న ఉపాధి హామీ పథకం కూలీలు

- వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్యే అభ్యర్థి భరత్‌కుమార్

అనకాపల్లి: వైఎస్సార్‌సీపీ పాలనలో పట్టణాలకు దీటుగా పల్లెలు అభివృద్ధి చెందాయని వైఎస్సార్‌సీపీ అనకాపల్లి ఎమ్మెల్యే అభ్యర్థి మలసాల భరత్‌కుమార్ తెలిపారు. మండలంలోని పాపయ్యపాలెం, పాపయ్యసంతపాలెం, మామిడిపాలెం గ్రామాల్లో ఉపాధి హామీ పథకం కూలీలతో శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సంక్షేమం, అభివృద్ధిని సమపాళ్లలో అమలు చేశారని చెప్పారు. మే 13న జరిగే సార్వత్రిక ఎన్నికల్లో మరోసారి జగన్‌మోహన్‌రెడ్డిని సీఎంగా గెలిపించుకోవాలన్నారు. ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి అనకాపల్లి ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా ఉప ముఖ్యమంత్రి బూడి ముత్యాలనాయుడు గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏపీఐడబ్ల్యూఏ చైర్మన్ దంతులూరి దిలీప్‌కుమార్, మార్కెట్ కమిటీ చైర్మన్ గొల్లవిల్లి శ్రీనివాసరావు, పార్టీ మండల అధ్యక్షుడు పెదిశెట్టి గోవింద్, పాపయ్యసంతపాలెం గ్రామ సర్పంచ్ అన్నం అప్పారావు, ఉప సర్పంచ్ గంగిరెడ్డి గోవింద, పార్టీ నేతలు నానాజీ, మంగనాయుడు, మువ్వలనాయుడు, మొల్లి మంగబాబు, సేనాపతి హరికృష్ణ, బంధం అప్పలనాయుడు, గౌరీనాగరాజు తదితరులు పాల్గొన్నారు.

మునగపాక ఉప సర్పంచ్ సత్యనారాయణే



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మునగపాక సర్పంచ్ అప్పారావు

మునగపాక: మేజర్ పంచాయతీ మునగపాక ఉప సర్పంచ్‌గా పెంటకోట సత్యనారాయణ కొనసాగుతారని సర్పంచ్ దిమ్మల అప్పారావు తెలిపారు. అనివార్య కారణాలతో సత్యనారాయణ ఉప సర్పంచ్ పదవికి రాజీనామా చేశారని, అయితే పంచాయతీ వార్డు సభ్యులు ఎవరూ ఇందుకు సమ్మతించకపోవడంతో ఆయనే ఉప సర్పంచ్‌గా కొనసాగించేలా చర్యలు తీసుకున్నామన్నారు. రాజీనామాను ఉపసంహరించుకున్నారని చెప్పారు. మునగపాకలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అప్పారావు, ఇతర పాలకవర్గ సభ్యులు మాట్లాడారు. ప్రజల అభీష్టం మేరకు సత్యనారాయణను ఉప సర్పంచ్‌గా పాలకవర్గ సభ్యులు ఎన్నుకున్న విషయాన్ని గుర్తుచేశారు. ఎమ్మెల్యే రమణమూర్తిరాజు, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షులు బొడ్డేడ ప్రసాద్‌ల సహకారంతో రానున్న రోజుల్లో మునగపాకను ఆదర్శంగా తీర్చిదిద్దుతామన్నారు. సమావేశంలో సచివాలయాల మండల కన్వీనర్ పొలిమేర గణేష్ , పార్టీ మండల కన్వీనర్ ఆడారి అచ్చియ్యనాయుడు, జెడ్పీటీసీ పెంటకోట స్వామి సత్యనారాయణ, ఎంపీటీసీలు సూరిశెట్టి రాము,బోడకుర్తి గణేష్, పార్టీ నాయకులు ఆడారి కాశీబాబు, బొడ్డేడ మహేష్‌తో పాటు పాలకవర్గ సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా నూకాంబిక ఆలయ ప్రారంభం



ఆలయ ప్రాంగణంలో నిర్వహిస్తున్న యాగం



నూకాంబిక అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

మునగపాక: మండలంలోని తిమ్మరాజుపేటలో నూకాంబిక అమ్మవారి ఆలయ ప్రారంభోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. వేద పండితుల మంత్రోచ్చరణల మధ్య ఆలయ ప్రాంగణంలో యాగం నిర్వహించారు. తిమ్మరాజుపేటతో పాటు పరిసర ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చి, అమ్మవారిని దర్శించుకున్నారు. తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలో సమరసత సేవా ఫౌండేషన్ సౌజన్యంతో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో భాగంగా భారీ అన్న సమారాధన నిర్వహించారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

అనకాపల్లి: పట్టణంలోని పలు ప్రాంతాల్లో శనివారం ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలగనున్నట్టు అనకాపల్లి డివిజన్ ఈఈ కె.రాజశేఖర్ శుక్రవారం తెలిపారు. డి-1 సెక్షన్ పరిధిలో శంకరం బ్రిడ్జి నుంచి దాడి సూరిబాబు కల్లాలు, కోట్ని అర్జునరావు కల్లాలు, ఎగ్రికల్చరల్ ఏరియా, లక్ష్మీదేవిపేట, రైల్వేట్రాక్ ఏరియా, డి-2 సెక్షన్ పరిధిలో సంతబయలు ఎన్‌హెచ్ ఏరియా, గ్రీన్‌హిల్స్ ఏరియా, రవి రాజు పెట్రోల్ బంక్ ఏరియా, ఆవఖండం టవర్స్ ఏరియాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని పేర్కొన్నారు.

1న పింఛన్ల పంపిణీ

మాడుగుల రూరల్: వచ్చే నెల ఒకటో తేదీ నుంచి పింఛన్లు పంపిణీ చేస్తామని ఎంపీడీవో ఆర్. కాశీప్రసాదురావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 30న పింఛను నగదును బ్యాంకుల ద్వారా విత్ డ్రా చేసి, వచ్చే నెల ఒకటి నుంచి ఐదో తేదీ లోపు గ్రామ సచివాలయాల వద్ద సిబ్బందితో పంపిణీ చేస్తామన్నారు. దీర్ఘకాలిక రోగులకు, దివ్యాంగులకు ఇంటి వద్ద పింఛన్ల సొమ్ము అందజేస్తారన్నారు.